GV MALL shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 79 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/-
సోమవారం 21 అక్టోబర్ 2024

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# గుర్లలో డయేరియా బాధితులను పరామర్శించిన పవన్కల్యాణ్

విజయనగరం జిల్లా గుర్లలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటించారు. స్థానిక పీహెచ్సీలో డయేరియా బాధితులను ఆయన పరామర్శించారు.



గుర్ల, అక్టోబర్ 21, (రిపబ్లిక్ న్యూస్): విజయనగరం జిల్లా గుర్లలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటించారు. స్థానిక పీహెచ్సీలో డయేరియా బాధితులను ఆయన పరామర్శించారు. వ్యాధి వ్యాప్తి, కారణాలపై అధికారులను ఆరా తీశారు. అనంతరం గుర్లలో బాధిత కుటుంబాలతో ఆయన మాట్లాడారు. అంతకుముందు నెల్లిమర్ల మండలం ఎస్ఎస్ఆర్ పేట వద్ద తాగునీటి పథకాన్ని పవన్ పరిశీలించారు. సాయంత్రం విజయనగరం కలెక్టరేట్లో అధికారులతో యన సమీక్ష నిర్వహించనున్నారు.

# ప్రపంచానికి ఆశాకిరణంలా భారత్: ప్రధాని మోదీ

## ప్రపంచ సంక్షోభ సమయంలో కూడా భారత్ వేగంగా అభివృద్ధి సాధిస్తోందని ప్రధాని మోదీ అభివర్ణించారు.



అక్టోబర్ 21, (రిపబ్లిక్ న్యూస్): ప్రపంచం మొత్తం కొవిడ్, యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలతో ఇబ్బంది. పడుతున్న వేళ కూడా మన దేశంలో 'భారత్ శతాబ్ది' గురించి ఆలోచిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. ఆయన 'ది ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్ లో ప్రారంభోపన్యాసం చేశారు. ప్రపంచానికి భారత్ ఆశాకిరణంలా కనిపిస్తోందన్నారు. దేశం ప్రతి రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని అభివర్ణించారు."మా ప్రభుత్వం ఇప్పటికే 125 రోజులు పూర్తి చేసుకొంది. ఈ కాలంలో మా ప్రభుత్వ అనుభవాన్ని మీతో పంచుకుంటాను. పేదలకు 3 కోట్ల కొత్త పక్కా గృహాలు ఇచ్చాం. రూ.9 లక్షల కోట్ల ఇన్ఫ్రా ప్రాజెక్టులపై పని మొదలైంది. 15 వందేభారత్ రైళ్లు ప్రారంభించాం. 8 కొత్త ఎయిర్ పోర్టుల పనికి శ్రీకారం చుట్టాం. యువతకు రూ.2లక్షల కోట్ల రూపాయల ప్యాకేజీ ఇచ్చాం. రైతుల ఖాతాల్లో రూ.21 వేల కోట్లను బదిలీ చేశాం. 70 ఏళ్లు దాటిన వృద్ధులకు ఉచిత వైద్యానికి ఏర్పాట్లు చేశాం. 5 లక్షల ఇళ్లలో రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేశాం. స్టాక్ మార్కెట్ సూచీల్లో దాదాపు 7 శాతం వృద్ధి నమోదైంది. విదేశీ మారకద్రవ్యం 700 బిలియన్ డాలర్లను దాటేసింది. నేను కేవలం 125 రోజుల్లో జరిగిందే చెబుతున్నాను. ఈ కాలంలో భారత్లో ప్రపంచం మూడు విషయాలు చర్చించడానికి వచ్చింది. టెలికామ్-డిజిటల్ ఫ్యూచర్పై అంతర్జాతీయ అసెంబ్లీ జరిగింది. గ్లోబల్ ఫిన్టెక్ ఫెస్టివల్ నిర్వహించారు. గ్లోబల్ సెమీకండెక్టర్ ఎకోసిస్టమ్పై సదస్సు జరిగింది. ఇవి భారత్ దిశ.. ప్రపంచం ఆశను తెలియజేస్తున్నాయి. ప్రపంచ భవిష్యత్తును భారత్ నిర్ణయిస్తుంది. మా ప్రభుత్వ మూడో విడత పాలనతో రేటింగ్ ఏజెన్సీలు దేశ వృద్ధిరేటును గణనీయంగా పెంచాయి" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్ వేగంగా వృద్ధి చెందుతున్న దేశమని ప్రధాని మోదీ అభివర్ణించారు. పేదల కష్టాలు తమకు బాగా తెలుసన్నారు. ఈ కార్యక్రమానికి ముందు ఆయన సదస్సులో పాల్గొనడానికి వచ్చిన విదేశీ అతిథులను కలుసుకొన్నారు. రెండ్రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో యూకే మాజీ ప్రధాని డేవిడ్ కామరూన్, భూటాన్ ప్రధాని దాసో త్సేరింగ్ టోబ్గే, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, భారతీ ఎయిర్టెల్ చైర్మన్ సునీల్ మిత్తల్ తదితరులు పాల్గొననున్నారు.

# సియోల్లో మాపో రిసోర్స్ రికవరీ ప్లాంట్ను సందర్శించిన తెలంగాణ మంత్రుల బృందం

దక్షిణ కొరియా రాజధాని సియోల్ లో తెలంగాణ మంత్రులు, అధికారుల బృందం పర్యటిస్తోంది. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ చామల కిరణకుమార్, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు ఈ బృందంలో ఉన్నారు.






హైదరాబాద్, అక్టోబర్ 21, (రిపబ్లిక్ న్యూస్): దక్షిణ కొరియా రాజధాని సియోల్లో తెలంగాణ మంత్రులు, అధికారుల బృందం పర్యటిస్తోంది. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్రెడ్డి, ఎంపీ చామల కిరణకుమార్ రెడ్డి, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, పలువురు ఎమ్మెల్యేలు, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్, జీహెచ్ఎంసీ, మూసీ రివర్ ఫ్రంట్ అధికారులు ఈ బృందంలో ఉన్నారు. సియోల్ లో చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేసే మాపో రిసోర్స్ రికవరీ ప్లాంట్ను ఈ బృందం సందర్శించింది.మాపో ప్లాంట్లో రోజుకు వెయ్యి టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. వ్యర్థాల రీసైక్లింగ్కు వేస్ట్ టు ఎనర్జీ టెక్నాలజీని సియోల్ నగరపాలక సంస్థ వాడుతోంది. పర్యావరణంపై దుష్ప్రభావం పడకుండా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. మరో 10 ఏళ్లలో పూర్తిగా భూ ఉపరితలం నుంచి తొలగించి భూగర్భంలో అతిపెద్ద ప్లాంట్ను నిర్మించేందుకు సియోల్ నగర పాలక సంస్థ ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మాపో ప్లాంట్ పనితీరును అధ్యయనం చేసేందుకు తెలంగాణ మంత్రుల బృందం వెళ్లింది.ఈ సందర్భంగా దానకిషోర్ మాట్లాడుతూ సియోల్, హైదరాబాద్ నగర నమూనాలు ఒకేలా ఉంటాయని తెలిపారు. సియోల్లో సుమారు 10వేల మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించి నగరంలోని నాలుగు వైపులకు తరలిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్లో దాదాపు 8వేల మెట్రిక్ టన్నులు సేకరించి ఒకే వైపునకు తీసుకెళ్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్రెడ్డి ఆదేశాల మేరకు నగరం చుట్టూ నాలుగు ప్రదేశాలను గుర్తించినట్లు వివరించారు. నగరంలోని చెత్తను నాలుగు వైపులకు పంపించడం ద్వారా రవాణా ఖర్చులు తగ్గుతాయన్నారు.హైదరాబాద్ నగరం, తెలంగాణ ప్రజల భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మూసీ నదిని ప్రక్షాళన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ఎంపీ చామల కిరణ్కుమార్రెడ్డి తెలిపారు. సియోల్లో చెయోంగ్ గయ్ చియోన్ నదిని ఆయన పరిశీలించారు.

# ఏపీ హైకోర్టులో అల్లు అర్జున్ పిటిషన్

## ఏపీ హైకోర్టులో సినీనటుడు అల్లు అర్జున్ పిటిషన్ దాఖలు చేశారు.



అమరావతి, అక్టోబర్ 21, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ హైకోర్టులో సినీనటుడు అల్లు అర్జున్ పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల సమయంలో నంద్యాలలో తనపై నమోదైన కేసును క్వాష్ చేయాలని ఆయన కోరారు. సెక్షన్ 144, పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉండగా అనుమతి లేకుండా జనసమీకరణ చేపట్టారంటూ అల్లు అర్జున్పై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ ను హైకోర్టు విచారణకు స్వీకరించింది. దీనిపై నేడు విచారణ జరగనుంది.

# అక్రమాలకు తావు లేకుండా 'ఆవాస్' లబ్ధిదారుల ఎంపిక: కేంద్రమంత్రి పెమ్మసాని

## ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద అక్రమాలకు తావు లేకుండా అర్హులకు లబ్ది చేకూర్చేందుకు చర్యలు చేపట్టినట్లు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.



గుంటూరు, అక్టోబర్ 21, (రిపబ్లిక్ న్యూస్): ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద అక్రమాలకు తావు లేకుండా అర్హులకు లబ్ధి చేకూర్చేందుకు చర్యలు చేపట్టినట్లు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పథకం కింద చేపట్టే నిర్మాణాలపై గుంటూరులోని ఆర్అండ్ బీ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. అక్రమాలకు తావు లేకుండా అర్హులకు 'ఆవాస్' ఆండ్రాయిడ్ అప్లికేషన్ ద్వారా దేశవ్యాప్తంగా రెండు కోట్ల నూతన గృహాల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న గృహాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పెమ్మసాని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్, జిల్లా కలెక్టర్, గృహనిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వైకాపా హయాంలో గృహ నిర్మాణ రంగం కుంటుపడింది: మంత్రి పార్థసారథి రానున్న ఐదేళ్లలో అర్హులైన పేదలకు ఇళ్లను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పార్థసారథి తెలిపారు. 2014-19లో యూనిట్ ఖరీదు రూ.2.5 లక్షలు ఉండగా.. వైకాపా ప్రభుత్వం రూ.1.8లక్షలకు తగ్గించినట్లు చెప్పారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో గృహ నిర్మాణ రంగం కుంటుపడిందన్నారు. కాలనీలోని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తేనే లబ్దిదారులు గృహ నిర్మాణాలకు ముందుకు వస్తారని చెప్పారు. అందుకే రాష్ట్రప్రభుత్వం మౌలిక సదుపాయాలపై దృష్టిసారించిందన్నారు.

# ఎలాంటి ఆందోళన చెందకుండా పరీక్షలు రాయండి: సీఎం రేవంత్

హైదరాబాద్, అక్టోబర్ 21, (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్రంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్లో ఆయన పోస్ట్ చేశారు. "గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు నా శుభాకాంక్షలు. ఎటువంటి ఆందోళన చెందకుండా పూర్తి ఏకాగ్రతతో పరీక్షలు రాయండి. ఈ పరీక్షల్లో మీరు విజయం సాధించి తెలంగాణ పునర్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని సీఎం పేర్కొన్నారు.



రాష్ట్రంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

